



# "కష్టపడింది ప్రజలు.. క్రెడిట్ కొట్టేది మీరు.. ఇక ఆ నాటకాలు సాగవు"

- **భాజపా సీనియర్ నాయకులు కాసోజు శంకరాచారి ఘాటు విమర్శలు**

**ఆశ్వి అప్డేట్స్ జూన్ 15:**

నేరడ–గాదిరెడ్డిపల్లె అనుసంధాన వంతెన అంశాన్ని కొందరు వ్యక్తులు తమ వ్యక్తిగత ప్రచారానికి, రాజకీయ మనుగడకు వేదికగా మార్చుకోవడం దురదృష్టకరమని భాజపా సీనియర్ నాయకులు కాసోజు శంకరాచారి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "రెండు సంవత్సరాల క్రితమే అధికారులు, శాఖలను సంప్రదించామని గొప్పలు చెప్పుకునే వారు నిజంగా అంత చిత్తశుద్ధితో పనిచేసి ఉంటే ఈరోజు గ్రామ ప్రజలు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో ముందుగా సమాధానం చెప్పాలి" అని ప్రశ్నించారు. అధికారులకు అర్జీలు ఇచ్చామని చెప్పుకోవడం ఒకటి, ప్రజల సమస్య పరిష్కారం కోసం నిరంతరం పోరాడటం మరోటి అని అన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పుడు కనిపించని వారు, ఉద్యమం ఫలితాలు కనిపించడం ప్రారంభమైన తర్వాత ముందుకు వచ్చి మొత్తం క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవాలని చూడటం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. గత కొన్ని సంవత్సరాలుగా రైతులు సాగునీటి సమస్యలతో, రాకపోకల ఇబ్బందులతో తీవ్రంగా నష్టపోతుంటే వారిని పట్టించుకోని వారు ఇప్పుడు గ్రామాభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. రైతుల కష్టాలపై పైశాచిక ఆనందం పొందిన వారే ఇప్పుడు ప్రజా సేవకులమంటూ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. "రూపాయి పని చేసి వంద రూపాయల ప్రచారం చేసుకునే సంస్కృతికి మీదని అది మానుకుంటే మంచిదని కితాబు పలికారు. ప్రజల కోసం పోరాడి ఫలితాలు సాధించడం మాకు తెలుసు. కానీ కొందరికి సోషల్ మీడియా పోస్టులు, తప్పుడు ప్రకటనలు, స్వప్రచారమే ప్రజాసేవగా కనిపిస్తోంది" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. గ్రామ ప్రజలు బ్రిడ్జి కోసం రోడ్లపైకి వచ్చి ఉద్యమిస్తే వారిపై కేసులు పెట్టించడం, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పించడం, ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడం ఎవరి చరిత్రలో ఉందో గ్రామ ప్రజలందరికీ తెలుసని అన్నారు. ఇప్పుడు అదే ప్రజలు ఏకమై బ్రిడ్జి కోసం పోరాడుతుంటే తట్టుకోలేక అసత్య ప్రచారాలకు దిగడం వారి రాజకీయ దౌర్భాగ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ వారం రోజులుగా గ్రామ ప్రజలు, మహిళలు, రైతులతో కలిసి చేపట్టిన ఉద్యమాలు, ధర్నాలు, అధికారులతో వరుస సమావేశాల వల్లే వంతెన నిర్మాణ అంశం ప్రభుత్వ దృష్టికి వెళ్లిందని స్పష్టం చేశారు. ప్రజల పోరాటాన్ని చూసి భయపడిన కొందరు రాజకీయ లబ్ధి కోసం తప్పుడు కథనాలు అల్లుతున్నారని ఆరోపించారు. "ప్రజలు అమాయకులు కారు. ఎవరు కష్టపడ్డారు, ఎవరు కేవలం ఫోటోలు దిగారు, ఎవరు పోరాడారు, ఎవరు క్రెడిట్ కోసం పరుగులు తీశారు అన్నది గ్రామస్తులకు స్పష్టంగా తెలుసు" అని అన్నారు. తమపై ఆరోపణలు చేసే వారు ముందుగా గ్రామానికి చేసిన సేవలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. "ప్రజా సమస్యలపై ఎప్పుడైనా ఉద్యమం చేశారా? రైతుల కోసం ఎప్పుడైనా నిలబడ్డారా? గ్రామ ప్రజలతో కలిసి ఒక్కరోజైనా పోరాటం చేశారా?" అని ప్రశ్నించారు. వంతెన కోసం జరుగుతున్న పోరాటం ఏ వ్యక్తి సొత్తు కాదని, ఇది ప్రజల హక్కుల కోసం జరుగుతున్న ఉద్యమమని అన్నారు. ప్రజల ఆకాంక్షలను అడ్డుపెట్టుకుని స్వప్రచారం చేసుకునే రాజకీయ అవకాశవాదులను గ్రామ ప్రజలు ఎప్పటికీ క్షమించరని హెచ్చరించారు. "మాకు పదవులు అవసరం లేదు.. ప్రచారం అవసరం లేదు.. గ్రామానికి వంతెన కావాలి, రైతులకు న్యాయం జరగాలి, ప్రజల సమస్యలు పరిష్కారం కావాలి. అదే మా లక్ష్యం. ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానేసి ప్రజల కోసం పనిచేయడం నేర్చుకోండి" అని కాసోజు శంకరాచారి స్పష్టం చేశారు.






# కిషన్ అన్నా మీ కోసం

**సికింద్రాబాద్, జూన్ 16 :**

కిషన్ అన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాంగోపాల్ పేట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి అనీష్ వర్మ ఆధ్వర్యంలో హైదర్ బస్తీలోని ఆశ్రిత హోమ్ లో గల అనాద పిల్లలకు నోట్ బుక్స్ ను పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనీష్ వర్మ మాట్లాడుతూ.. కిషన్ రెడ్డి స్ఫూర్తితో సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బూర్గుల శ్యాంసుందర్ గౌడ్, అధికార ప్రతినిధి అభిషేక్ జగిని, రాష్ట్ర యువజన నాయకులు మర్రి పురురవ రెడ్డి, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్. ఉపాధ్యక్షులు శ్రీశైలం గౌడ్, డివిజన్ అధ్యక్షులు సందీప్ వర్మ, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ సూర్యవంశీ. డివిజన్ మాజీ అధ్యక్షులు ఆకుల ప్రతాప్, సీనియర్ నాయకులు వజనాల దయానంద్, మనోజ్ ఉపాధ్యాయ్, మనోహర్, శ్రీనివాస్ గౌడ్, కీర్తి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీల అభ్యున్నతికి కృషి చేస్తా : రయీసుద్దీన్ రషాద్

- **సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా నియామకం**

**సిద్దిపేట, ఆశ్వి అప్డేట్స్**



సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా రయీసుద్దీన్ రషాద్‌ను నియమించినట్లు రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన రయీసుద్దీన్ రషాద్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీకి, జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణకు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని రయీసుద్దీన్ రషాద్ పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తూ మైనారిటీ వర్గాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు.జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి, మైనారిటీ వర్గాలకు పార్టీ కార్యక్రమాలను చేరువ చేయడానికి తన వంతు పాత్ర పోషిస్తానని ఆయన స్పష్టం చేశారు.

# అమర్‌నాథ్ అన్నదాన సేవ పుణ్యకార్యం – హరీశ్‌రావు

- **అమర్‌నాథ్ యాత్రకు సరుకుల లారీ ప్రారంభం**
- **19న సిద్దిపేటలో చాగంటి కోటేశ్వరరావు గో సంరక్షణ ప్రవచనాలు**

**సిద్దిపేట, ఆశ్వి అప్డేట్స్**

అమర్‌నాథ్ యాత్రికులకు అందించే అన్నదాన సేవ గొప్ప పుణ్యకార్యమని, భక్తితో అందించే ఆహారం ప్రసాదంగా మారుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలోని శరభేశ్వర దేవాలయం వద్ద అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో అమర్‌నాథ్ యాత్రకు పంపుతున్న సరుకుల లారీని ఆయన ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ సిద్దిపేటకు ఆధ్యాత్మిక, ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తిరుపతి, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాల్లో సిద్దిపేటకు ఉన్న ప్రత్యేకత మాదిరిగానే అమర్‌నాథ్‌లో కూడా సిద్దిపేట లంగర్‌కు విశిష్ట స్థానం ఏర్పడిందన్నారు. దక్షిణ భారతదేశంలో అమర్‌నాథ్ అన్నదాన సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న సంస్థగా సిద్దిపేట అమర్‌నాథ్ సేవా సమితి పేరు సంపాదించుకుందన్నారు. గత 15 సంవత్సరాలుగా నిరంతరంగా యాత్రికులకు అన్నదాన సేవ అందించడం అభినందనీయమని, ఇందులో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా వైశ్య సంఘం సభ్యులు విశేషంగా సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఆధ్యాత్మికత మనసుకు ప్రశాంతతను అందిస్తుందని పేర్కొంటూ, "నీటిలో భక్తి ప్రవేశిస్తే తీర్థం అవుతుంది.. యాత్రకు భక్తి తోడైతే తీర్థయాత్ర అవుతుంది.. సహాయంలో భక్తి ఉంటే అది సేవగా మారుతుంది.. మీరు పంపే ఆహారంలో భక్తి ప్రవేశిస్తే అది ప్రసాదం అవుతుంది. అందువల్ల మీరు చేస్తున్న సేవ పుణ్యకార్యంగా నిలుస్తుందని హరీశ్‌రావు అన్నారు.అదేవిధంగా ఈ నెల 19న ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు సిద్దిపేటలో గో సంరక్షణ అంశంపై ప్రవచనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సిద్దిపేట వైశ్య కన్వెన్షన్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.





# పర్దిపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

- **సర్పంచ్ తెలుగు శివ కుమార్**

**చిన్నచింతకుంట జూన్ 16 ( అశ్వి అప్డేట్స్);**

చిన్నచింతకుంట మండలం, పర్దిపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ తెలుగు శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థు లకు అక్షర అభ్యాసాన్ని నేర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్న పిల్లల కోసమే ప్రభుత్వం ఎంతో కష్టపడి పౌష్టికాహారాన్ని పంపిస్తుంది. అట్టి పౌష్టిక ఆహారాన్ని విద్యార్థులకు దగ్గరుండి తినిపించి అక్షరాభ్యాసం నేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేపాల్, ఉపాధ్యాయులు, గ్రామానికి సంబంధించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చిన్నారుల విద్యాభ్యాసానికి తొలి అడుగు అక్షరాభ్యాసం —— భవిష్యత్తుకు బలమైన పునాది.

ప్రైవేటు పాఠశాలలు వద్దు, ప్రభుత్వ పాఠశాలలే ముద్దు









## భారీగా బిల్డింగులు, బంగారం, నగదు.. అవినీతి అధికారి ఆస్తుల చిట్టా

అక్రమాస్తుల కేసులో ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరిని ఏసీబీ అరెస్టు చేసింది. సోదాల్లో భారీగా ఆస్తులు గుర్తించారు. రంగారెడ్డి జిల్లాల్లో 5 ఓపెన్ ప్లాట్లు, మహేశ్వరంలో 1.24 ఎకరాల వ్యవసాయ భూమి, మణికొండ, నార్సింగి, రాజేంద్రనగర్, ఛత్రినాకలో 6 బిల్డింగులు, బ్యాంక్ ఖాతాలో రూ.2.29 కోట్లు, రూ.5 కోట్ల FDలు ఉన్నట్లు గుర్తించారు. 1.3 KGల బంగారం, 8 కేజీల వెండి, రూ.1.54 కోట్ల నగదు సీజ్ చేశారు.



